

రైతులకు అండగా ఉంటాం

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శుక్రవారం పలు గ్రామాలలో పర్యటించారు. నష్టపోయిన పంటలను పరిశీలించారు.

- 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ — శని : 6:33

సహర్ — ఆది : 4:55

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.2 / 16.9

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'నవోదయ'లో విచారణ

నిజాంసాగర్: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం చోటు చేసుకున్న ఘటనపై శుక్రవారం బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ విచారణ జరిపారు. విద్యాలయంలో గురువారం రాత్రి వేళ డిన్నర్ సమయంలో మైగ్రేషన్ విద్యార్థులు, స్థానిక విద్యార్థుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాటామాటా పెరిగి దాడికి దారి తీసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యాలయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని విద్యార్థులకు సూచించారు.

'ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి'



బిచ్కుంద: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన రాజుల్లా గ్రామంలోని పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని బీఎల్‌వోలకు సూచించారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపుపై దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఆర్‌ఐ రవీందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి వాసవీకాలనీలోని తెలంగాణ మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ప్రవేశంకోసం ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లోగాని, కళాశాలలోగాని దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 89788 47884 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు భాషా పండితుల జిల్లా స్థాయి సమావేశం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో ఆదివారం భాషా పండితుల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నాయకులు హాజరయ్యే సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లాలోని తెలుగు, హిందీ భాషా పండితులను కోరారు.

27న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 27న నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ గణేశ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సమావేశం హాల్‌లో, సదాశివనగర్‌లోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో నిధి ఆప్కే నికట్‌కు హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు

- హోలీ, ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కల కారణంగా..

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు హోలీ, ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కల కారణంగా ఈనెల 27, 28 మినహా వరుస సెలవులు ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మర్చంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఈనెల 25, 26 తేదీల్లో హోలీ పండుగ సందర్భంగా యార్డు బంద్ ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో మాత్రమే పసుపు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కల కారణంగా 29 నుంచి 31వ తేదీ వరకు యార్డులో వ్యాపార కార్యకలాపాలు నిలిపివేస్తున్నామన్నారు. కావున రైతులు ఈ విషయాన్ని గమనించి పైన తెలిపిన తేదీల్లో యార్డుకు సరుకులు తీసుకురావద్దని కోరారు. తిరిగి ఏప్రిల్ 1 నుంచి మార్కెట్‌లో కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

నిషేధిత మందులపై ఉక్కుపాదం..

- వరుస దాడులు చేస్తున్న డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు
- పట్టుబడుతున్న నకిలీ, తక్కువ క్వాలిటీ మందులు
- కామారెడ్డి, నిజామాబాద్, బోధన్‌లలో కేసులు నమోదు



రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ, నిషేధిత ఔషధాలు, నిషేధిత ప్రకటనలతో కూడిన మందుల అమ్మకాలపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా వరుస దాడులు చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బోధన్, కామారెడ్డి, నిజామాబాద్‌లలో రెండున్నర నెలల్లో పలుమార్లు అక్రమ నిల్వలపై దాడులు చేశారు. పలువురిపై కేసులు నమోదు చేశారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరంలో గత నెలలో అధికారులు దాడులు చేసి నకిలీ ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో ఆహార తయారీ లైసెన్స్ మాత్రమే కలిగిన ఒక తయారీ యూనిట్‌లో 'పాంటాప్రోజోలా' అనే ఎసిడిటీకి వాడే నకిలీ ఔషధాన్ని తయారు చేసి నిజామాబాద్‌కు రవాణా చేయగా ఇక్కడ పట్టుకున్నారు. ఈ నకిలీ మందుపై పంజాబ్‌కు చెందిన ఓ నకిలీ కంపెనీ పేరు ముద్రించారు. ఈ నకిలీ మందులో మెడిసిన్ పాళ్లు సున్నా. నకిలీ మందును 'స్పూరియస్'గా పిలుస్తారు. దీనిపై నిజామాబాద్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. అదేవిధంగా నిజామాబాద్‌లో జరిగిన మరో దాడిలో విజయవాడ నుంచి తీసుకొచ్చిన తక్కువ క్వాలిటీ కలిగిన ఉత్తరాఖండ్‌లోని కార్టెల్ ల్యాబొరేటరీస్‌లో తయారు చేసిన మందులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

- బోధన్ మండలం కల్దుర్తిలో జనవరి 29న డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు చేశారు. లైసెన్స్ లేకుండా ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌లో నిల్వ చేసి అమ్ముతున్న యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, యాంటీ అల్సర్ డ్రగ్స్, యాంటీ హైపర్‌టెన్సివ్, అనాల్జెసిక్స్ అనే 52 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.
- ఈనెల 21న కామారెడ్డిలో దాడులు నిర్వహించారు. నిషేధిత ప్రకటనలతో కూడిన ఔషధాలను విక్రయిస్తున్న ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్‌పై కేసు నమోదు చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే డీలర్లపై కేసులు

అమ్మకాల కోసం లైసెన్స్ లేని రిటైల్ వ్యాపారులకు హోల్‌సేల్ డీలర్లు ఔషధాలు సరఫరా చేయకూడదని కామారెడ్డి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి తెలిపారు. అయినప్పటికీ విక్రయిస్తే హోల్‌సేల్ డీలర్లపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా కొన్ని ఔషధాలకు సంబంధించి ఆయా నయమయ్యే రుగ్మతల గురించి లేబుల్స్‌పై ముద్రించకూడదన్నారు.



కామారెడ్డిలో స్వాధీనం చేసుకున్న మందు ఇదే..

ఏజెన్సీ, తయారీ కంపెనీపై కేసు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కోణార్క్ ఫార్మాలో విక్రయిస్తున్న నిషేధిత ఔషధాలకు సంబంధించిన 72 స్ట్రిప్‌ల ట్యాబ్లెట్స్‌ను స్వాధీనం చేసుకుని, బాధ్యులకు నోటీసులు ఇచ్చామని కామారెడ్డి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి తెలిపారు. నిషేధిత కొలినాల్ స్పాస్ ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నామని, వాటికి డీలర్‌గా ఉన్న కామారెడ్డిలోని ఏజెన్సీతో పాటు సంబంధిత ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన తయారీదారు వివిమేడ్ ల్యాబ్స్‌కు నోటీసులు జారీ చేసి కేసులు నమోదు చేశామని తెలిపారు. నివేదికలను కోర్టుకు సమర్పించామన్నారు. విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

108కు నిలువ నీడేది?



కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆవరణలో ఎండలో ఉన్న అంబులెన్సులు

- ఎండల్లోనే అంబులెన్సులు
- సిబ్బందికీ తప్పని కష్టాలు

సాక్షి, కామారెడ్డి: ఎవరికి ఏ ఆపద వచ్చినా 108 నంబరుకు కాల్ చేయగానే కుయ్‌కుయ్ మంటూ క్షణాల్లో చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించే అంబులెన్సులకు నిలువ నీడ కరువయ్యింది. సేద తీరేందుకు సరైన వసతులు లేక సిబ్బంది ఇబ్బందులుపడుతున్నారు. జిల్లాలో ప్రమాదాలు జరిగినప్పుడు 108 అంబులెన్స్‌లలో ఆస్పత్రులకు తరలిస్తుంటారు. జిల్లాలో 14 అంబులెన్సులు సేవలందిస్తున్నాయి.

ముఖ్యంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉండే అంబులెన్సు పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాలకు కూడా సేవలందిస్తోంది. చిన్నపిల్లల కోసం నియోనాటల్ అంబులెన్సు కూడా కామారెడ్డి కేంద్రంగా పనిచేస్తోంది. అయితే కామారెడ్డి పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న ఓ గదిని 108 సిబ్బంది కోసం కేటాయించారు. సిబ్బంది అక్కడే ఉండి అంబులెన్సులను కూడా అక్కడే ఉంచుకుని కాల్స్ రాగానే వెళ్లేవారు. అయితే రైల్వే స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా 108 సిబ్బందికి కేటాయించిన షెడ్‌ను రైల్వే అధికారులు కూల్చివేయించారు. దీంతో అంబులెన్స్ సిబ్బంది రోడ్డున పడాల్సి వచ్చింది. నిలిపేందుకు నీడ లేకపోవడంతో అంబులెన్సులను స్టేషన్ ఆవరణలో ఎండలోనే నిలిపి ఉంచుతున్నారు. సిబ్బంది సేద తీరడానికీ ఎలాంటి సౌకర్యాలు లేవు. అంబులెన్సులను ఎండలో నిలుపుతుండడంతో అందులో ఉన్న విలువైన సామగ్రి దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఎంతో మంది ప్రాణాలను కాపాడే సిబ్బందితో పాటు అంబులెన్సులకు కనీసం నిలువనీడైనా కల్పించాలని కోరుతున్నారు.

అరకొరగానే..

జిల్లాలో 14 అంబులెన్సులు పనిచేస్తున్నాయి. కామారెడ్డి, మాచారెడ్డి, భిక్కనూరు, లింగంపేట, ఎల్లారెడ్డి, గాంధారి, దోమకొండ, సదాశివనగర్, బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, జుక్కల్, పిట్లంలలో అంబులెన్సులున్నాయి. అయితే ఎక్కడా అంబులెన్సులకు, సిబ్బందికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఒకే 108 అంబులెన్సు అందుబాటులో ఉంది. కామారెడ్డి పట్టణంతో పాటు కామారెడ్డి, రాజంపేట, తాడ్వాయి, రామారెడ్డి మండలాల్లోని గ్రామాలకు కూడా ఇక్కడి నుంచే వాహనం వెళ్తుంది. రోజూ పదికి పైగా కాల్స్ అటెండ్ అవుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఇక్కడ మరో వాహనాన్ని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, డోంగ్లీ, నస్రుల్లాబాద్, పాల్వంచ, రామారెడ్డి, రాజంపేట, బీబీపేట, తాడ్వాయి మండలాలలో 108 అంబులెన్స్‌లు లేవు. ఆయా మండలాలకూ వాహనాలను మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పొరుగున ఉన్న సిరిసిల్ల నియోజకవర్గంలో అన్ని మండలాల్లో అంబులెన్సులు ఉన్నాయి. మన జిల్లాలో మాత్రం సరిపడా అంబులెన్సులు లేవు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి

- అధికారులు నష్టం వివరాలు సేకరించాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: ఇటీవల కురిసిన వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు రెండు రోజుల క్రితం జిల్లాలో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారని, బాధిత రైతులను ఆదుకుంటామన్నారని పేర్కొన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే ఊరుకునేది లేదన్నారు. తాను కూడా నియోజకవర్గంలో పర్యటించి పూర్తి వివరాలను సేకరించానన్నారు. కలెక్టర్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో నష్టపోయిన పంటల వివరాలను సేకరించకపోవడాన్ని తప్పుపట్టారు. రాజకీయ నేతలు పర్యటించి రైతులకు ధైర్యం చెబుతారని, కానీ అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలను సేకరించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. గతంలో పంటలు నష్టయిన్న రైతులకు న్యాయం జరగలేదన్నారు. ఈసారి న్యాయం చేయకపోతే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రకృతి వైపరీత్యాల విషయంలో సహాయ కార్యక్రమాలకు ఎన్నికల కోడ్ అడ్డు రాదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పంట పొలాల్లో పడిపోయిన స్తంభాలు, ఇతర నష్టాలకు రైతుల నుంచి డబ్బులు తీసుకోకుండా త్వరితగతిన పునరుద్ధరణ పనులు చేయాలన్నారు. నియోజకవర్గంలో 8 వేల ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతులందరినీ ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

- జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి
- రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం ప్రారంభం



నూతన కోర్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న జడ్జీలు, కలెక్టర్, ఎస్పీ

కామారెడ్డి క్రైం: కేసుల సత్వర పరిష్కారమే అందరి ధ్యేయం కావాలని హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి సూచించారు. శుక్రవారం కామారెడ్డి కోర్టు భవన సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానాన్ని వర్చువల్ విధానంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కోర్టుకు వెళ్తే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కక్షిదారులల్లో కలిగేలా న్యాయ వ్యవస్థ పనిచేయాలన్నారు. పెరుగుతున్న జనాభా, కేసులకు అనుగుణంగా న్యాయస్థానాల ఏర్పాటు ఆవశ్యకత కూడా పెరిగిందన్నారు. కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడం మంచిది కాదన్నారు. చట్టాలకు అనుగుణంగా నడుచుకొంటూ పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. న్యాయ వ్యవస్థకు బార్, బెంచ్ రెండు చక్రాలలాంటివన్నారు. రెండూ సక్రమంగా పనిచేస్తేనే కేసుల సత్వర పరిష్కారం జరిగి కక్షిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎస్ శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దీక్ష, అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మలు కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టు హాలు, జడ్జి చాంబర్‌ను సందర్శించి పూజలు చేశారు. నూతన కోర్టు జడ్జిగా జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, సూపరింటెండెంట్లు వెంకట్‌రెడ్డి, శ్రీధర్, చంద్రసేన్‌రెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుకు ఎసరు!

- శిఖం భూమిపై రియల్టర్ల కన్ను
- కనుమరుగవుతున్న బాన్సువాడ కల్కి చెరువు శిఖం
- రాత్రి వేళల్లో జోరుగా పూడ్చివేత పనులు
- పట్టించుకోని అధికారులు



చెరువులోకి వచ్చే ఉప కాలువపై వేసిన రోడ్డు



బాన్సువాడలో కల్కి చెరువు శిఖంలో వేసిన మొరం రోడ్డు

బాన్సువాడ : రియల్టర్ల ఆడగాలకు అడ్డూఅదుపులేకుండా పోతోంది. వారి కన్నుపడిందంటే చెరువులు, కుంటలు మాయమవుతున్నాయి. నిత్యం నీటితో కళకళలాడుతూ సాగునీరందించే కల్కి చెరువుపై తాజాగా రియల్టర్ల కన్నుపడింది. రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారుల కళ్లుగప్పి, రాత్రికి రాత్రి లారీల్లో మొరం తరలిస్తూ చెరువు శిఖం భూముల్లో నింపుతున్నారు. రోజురోజుకు చెరువు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు రియల్టర్లకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

లారీల్లో మట్టి డంపింగ్

బాన్సువాడ కల్కి చెరువు చివరన బీడీ వర్కర్స్ కాలనీని ఏర్పాటు చేశారు. అప్పట్లో అక్కడ శిఖం భూములు ఉన్నాయని, చెరువుకు దూరంగా ఉన్న కొంత మంది రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి బీడీ వర్కర్స్ కాలనీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చెరువుకు ఆనుకుని ఉన్న ప్రైవేటు భూములను కొందరు రియల్టర్లు కొనుగోలు చేసి ఆ భూముల్లో శిఖం భూములను కలుపుకుని వెంచర్లుగా మారుస్తున్నారు.వర్షకాలంలో శిఖం భూముల్లో మూడు, నాలుగుఫీట్ల మేర నీరు నిలువ ఉంటుంది. ఎలాగైనా ఈ శిఖం భూములను తాము కొనుగోలు చేసిన భూముల్లో కలుపుకోవాలని భావించిన రియల్టర్లు నిజాంసాగర్ మండలం గాలిపూర్, సింగీతం శివారు ప్రాంతాల నుంచి టిప్పర్లలో మొరం తీసుకువచ్చి శిఖం భూముల్లో నింపుతున్నారు. సెలవు రోజుల్లో వందలాది టిప్పర్ల ద్వారా మొరం తీసుకువస్తున్నారు. ఎగువ నుంచి వరద చెరువులోకి రాకుండా అడ్డుకట్టలు వేస్తున్నారు. వరద నీరు వచ్చేచోట్ల సీసీ డ్రైనేజీలు నిర్మించారు. రియల్టర్ల తీరుతో భవిష్యత్‌లో బీడీ వర్కర్స్ కాలనీ వరద నీటిలో మునిగే ప్రమాదం ఉంది. బీడీ వర్కర్స్ కాలనీ వాసులు, కల్కి చెరువు ఆయకట్టు రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు రియల్టర్లకే వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలున్నాయి.

చర్యలు తీసుకుంటాం

బీడీ వర్కర్స్ కాలనీ సమీపంలోని కల్కి చెరువు శిఖం భూముల్లో ఎవరైనా మొరం నింపినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. నీటిపారుదల శాఖ అధికారులతో సర్వే చేయిస్తాం. ప్రభుత్వ భూములు కబ్జా చేసినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవు.

–వరప్రసాద్, తహసీల్దార్, బాన్సువాడ

'ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి'

కామారెడ్డి క్రైం: దేశ గతిని మార్చే శక్తి ఉన్న ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వాక్ టు పోలింగ్ స్టేషన్ కార్యక్రమం చేపట్టారు. గత ఎన్నికలలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన కామారెడ్డి పట్టణంలోని వడ్డెర కాలనీలోని 214 పోలింగ్ బూత్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలెక్టర్ మాట్లాడి, ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో జిల్లాలోని రెండు పోలింగ్ కేంద్రాలలో 51 శాతంలోపు పోలింగ్ నమోదైందన్నారు. కామారెడ్డి పట్టణంలోని వడ్డెర కాలనీలోగల 214 పోలింగ్ కేంద్రంతోపాటు, శ్రీరాంనగర్ కాలనీలోని 255 పోలింగ్ కేంద్రాలలో తక్కువ పోలింగ్ నమోదైందని, ఇందుకు గల కారణాలను విశ్లేషించి ఓటింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వడ్డెర కాలనీ వాసులతో మాట్లాడగా స్థానికులందరం ఓటు వేస్తున్నామని తెలిపారు. కిరాయిదారులు, వలసదారులు ఓటింగ్ రోజు రాకపోవడం వల్ల ఓటింగ్ శాతం తగ్గి ఉండవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఓటరు జాబితాను పరిశీలించి, ప్రతి ఒక్కరు ఓటు వేసేలా చూడాలని బూత్ స్థాయి అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, ఆర్డీవో రంగనాథరావు, స్వీప్ నోడల్ అధికారి వెంకటేష్, బూత్ స్థాయి అధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.



వడ్డెర కాలనీ వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ

క్లుప్తంగా

ఎన్‌సీసీ క్యాడెట్‌ను సన్మానించిన ఎస్పీ



కామారెడ్డి క్రైం/కామారెడ్డి అర్బన్ : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 2024 రిపబ్లిక్ డే క్యాంపు ముగించుకుని తిరిగివచ్చిన కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ కె.యోచన ను ఎస్పీ సింధు శర్మ అభినందించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అందుకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ఎం.చంద్రకాంత్, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం పీజీ కో ఆర్డినేటర్ రాజుకుమార్, ఎన్ సీసీ అధికారి లెఫ్టినెంట్ రామస్వామి, క్యాడెట్‌లు శ్రవణ్, ప్రవీణ్, సి.హెచ్. కావ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్య సహకార పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ వెల్లడించారు. శుక్రవారం ఆయన లింగంపేట మండలం మోతె గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మత్స్యకారుల డిమాండ్ల సాధనకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం మోతె గ్రామానికి చెందిన మత్స్యకార సొసైటీ సభ్యులు జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ భవానిపేట సాయిలు, రవి, ప్రవీణ్, బాలరాజు, శ్రీకాంత్, స్వామి, సుధాకర్, రాములు తదితరులున్నారు.

నూతన వంతెన నిర్మిస్తాం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : నూతన వంతెన నిర్మాణం చేపడుతామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం మండలంలోని విఠల్ వాడి, విఠల్ వాడి తండా మీదుగా వెళ్తుండగా రెండు గ్రామాల మధ్యలో ఉన్న వంతెన సగభాగం కూలిపోయి ఉండగా ఆయన పరిశీలించారు. త్వరలోనే వంతెన నిర్మాణం చేస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, మోహన్, మల్లప్ప పటేల్ పాల్గొన్నారు.

జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి



ఎల్లారెడ్డి: జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకమైన వారికి నియామక పత్రాలను అందించారు. ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కుర్మ సాయిబాబా, లింగంపేట మండల అధ్యక్షుడిగా బుర్ర నారాగౌడ్, నాగిరెడ్డిపేట మండల అధ్యక్షుడిగా శ్రీధర్‌గౌడ్, సదాశివనగర్‌కు జూకంటి సంగారెడ్డి, గాంధారికి మోహన్‌నాయక్, తాడ్వాయికి జూకంటి వెంకట్‌రెడ్డి, రాజంపేట,రామారెడ్డి మండలాలకు(ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గ్రామాలకు) యాదవ్‌రెడ్డి, గొలపల్లి లక్ష్మాగౌడ్‌లను నియమించారు.

సమస్యల వలయం.. గ్రంథాలయం

- వరుస నోటిఫికేషన్లతో లైబ్రరీకి రీడర్ల తాకిడి
- కనీస వసతుల్లేక ఇబ్బందులు



ఎల్లారెడ్డిలోని శాఖా గ్రంథాలయం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని గ్రంథాలయంలో పాఠకులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల అన్ని ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు ప్రకటించడంతో అందరు ఉద్యోగాలను సాధించేందుకు గ్రంథాలయాల బాట పట్టారు. నోటిఫికేషన్ల కారణంగా సాధారణ రోజుల్లో తాకిడి తక్కువగా ఉన్నా ప్రస్తుతం లైబ్రరీలో పాఠకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. అయితే గ్రంథాలయంలో కనీసం పాఠకులకు సరిపడా చైర్లు లేక, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, ఫ్యాన్లు తిరగక పోవడం, వెలుతురు సరిగా లేక పోవడం, వాష్‌రూంలు లేక పోవడంతో మహిళా పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా అకడమిక్ పుస్తకాలు లేకపోవడంతో పాటు గ్రూప్స్‌కు సంబంధించిన పుస్తకాలు లేక పాఠకులు ప్రిపరేషన్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి లైబ్రరీలో అన్ని వసతులు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

పుస్తకాలు సరిపడా లేవు..



గ్రంథాలయంలో తెలుగు అకాడమికి సంబంధించిన పుస్తకాలతో పాటు, గ్రూప్స్ ప్రిపరేషన్‌కు సంబందించిన పుస్తకాలు లేక ప్రిపరేషన్‌కు ఇబ్బందిగా ఉంది. పాఠకులకు సరిపడా పుస్తకాలు తెప్పించాలి.
– రమేశ్, పాఠకుడు, ఎల్లారెడ్డి

ఇబ్బందులు పడుతున్నాం..



గ్రంథాలయంలో పాఠకులకు సరిపడా సౌకర్యాలు లేవు. స్టడీ చైర్లు, ఫ్యాన్లు, తగిన వెలుతురు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కనీస సౌకర్యాలను ఏర్పా టు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలి.
– శ్రీనివాస్, దావల్‌మల్కపల్లి, ఎల్లారెడ్డి మండలం

కష్టంగా ఉంది..



గ్రంథాలయంలో వాష్‌రూం లేక పోవడంతో దూరంగా వెళ్లాల్సి వస్తోంది. లైబ్రరీ ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వాష్‌రూంలలో నీరు పోకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఉద్యోగ నోటిఫికేషన్లు రావడంతో పాఠకుల తాకిడా బాగా పెరిగింది.
– వినోద్, ఎల్లారెడ్డి

అధికారులకు నివేదించాం..

లైబ్రరీలో అకడమిక్, గ్రూప్స్‌కు సంబంధించిన పుస్తకాలు సరిపడా లేవని ఉన్నతాధికారులకు సూచించడంతో కొంత మేర పుస్తకాలను పంపాం. మరిన్ని పుస్తకాలు, వెలుతురు, పెయింటింగ్‌కు సంబంధించి నివేదిక పంపాం. నిధులు రాగానే వాటి సమస్యను పరిష్కరిస్తాం.
– జాకీర్, గ్రంథపాలకుడు, ఎల్లారెడ్డి

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దోమకొండ : మండల కేంద్రంలోని గ్రామ జీపీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ సంజయ్‌రావ్ పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన 108 పోలింగ్ కేంద్రంను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. రెవెన్యూ సిబ్బంది నర్సింలు, రాజు, కిష్టయ్య, శంకర్, బీఎల్‌వోలు, ఎస్‌ఎచ్‌జీలు, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి రూరల్ పరిధిలో.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని మీసానిపల్లి, భిక్కనూర్ గ్రామంలో పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో లక్ష్మీ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించి కేంద్రంలో గల సమస్యలను ఆమె నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, బీఎల్‌వో తదితరులున్నారు.

ముదిరాజ్ జెండావిష్కరణ



ముదిరాజ్ జెండాను ఆవిష్కరిస్తున్న రాజేశ్వర్

భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షులు పున్న రాజేశ్వర్ ఆవిష్కరించారు. పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలకు హాజరైన సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు నీల నాగరాజ్, మద్ది నాగరాజ్, మద్ది రామచంద్రం, సదరు సంఘం అధ్యక్షులు నారాయణ, యువజన అధ్యక్షులు ప్రవీన్, ప్రతినిధులు సందీప్, ప్రశాంత్, స్వామి, గణేశ్, సిద్దరాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు



నిజాంసాగర్(జుక్కల్) : పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి తాజా మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు బిగ్ షాక్ ఇస్తున్నారు. శుక్రవారం మద్నూర్, పెద్దకొడప్ గల్ మండలాల్లోని సోనాల, గోజేగావ్, బూర్గుపల్లి, పోచార తండా, శివపూర్ పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు జుక్కల్ ఎమ్మెల్యే తోట, లక్ష్మీకాంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం మంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా నియోజకవర్గం అభివృద్ధి చెందలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి జై కొడుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేసి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రానికి ఆదర్శంగా నిలుపుతానని చెప్పారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హత్యకేసులో నలుగురికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: 'మంత్రాల నెపంతో హత్య' కేసులో నలుగురికి జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పీఎస్ పరిధిలోని మామిడిపల్లిలో 2018లో బోణిగె భారతిని నలుగురు కలిసి హత్య చేశారు. బోణిగె భారతి చేతబడి చేయడం వల్లే అనారోగ్యం పాలయ్యానని గ్రామానికి చెందిన తోకల చిత్ర అనుమానం పెంచుకున్నది. తన సమీప బంధువువైన బట్టు వెంకటేష్ చిత్ర ఆలియాస్ చింటూకు తెలిపి భారతిని హతమార్చాలని చెప్పింది. చింటూ తన స్నేహితులైన పందిర్ల రాజేందర్‌గౌడ్, బట్టు రంజిత్‌లకు విషయం తెలిపాడు. ఈ క్రమంలో నలుగురు కలిసి 2018 జూలై 8న మధ్యాహ్నం భారతి ఇంట్లోకి చొరబడ్డారు. వారి వెంట తీసుకువెళ్లిన కత్తితో ఒంటరిగా ఉన్న భారతి గొంతుకోసి చంపారు. భారతి చెవులను కోసి చెవులకు ఉన్న బంగారం, బంగారు చైన్ తీసుకున్నారు. దోపిడీ దొంగలు హత్య చేసినట్లు సృష్టించే ప్రయత్నం చేశారు. కాలి, వేలి ముద్రలు, సీసీ కెమెరాల దృశ్యాలు, ఫోన్ లోకేషన్ ఆధారంగా నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు విచారణలో భాగంగా చార్జిషీట్ ఫైల్ చేయగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి నలుగురికి జీవితఖైదుతో పాటు మరో ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 3వేల జరిమానా విధించారు.

వైద్యుడి నిర్లక్ష్యంతో బాలుడి మృతి!



వికాస్

అర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహ ఆనంద్ పిల్లల ఆస్పత్రిలో వైద్యుడి నిర్లక్ష్యంతో అంకాపూర్‌కు చెందిన ఏడాది బాలుడు నీలం వికాస్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాలు.. మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన నీలం మహేందర్, గంగ దంపతుల కుమారుడు వికాస్‌కు శుక్రవారం ఉదయం ఫిట్స్ వచ్చింది. దీంతో ఆర్మూర్‌లోని ఆనంద్ పిల్లల ఆస్పత్రికి తీసుకు వచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యుడు పరిస్థితి విషమంగా ఉందని జిల్లా కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో నిజామాబాద్ తరలించడానికి అంబులెన్సు సిద్ధం చేసుకున్న తల్లిదండ్రులకు తానే చికిత్స చేస్తానని వైద్యుడు ఆనంద్ చెప్పారు. దీంతో ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. మధ్యాహ్నం సమయంలో వికాస్‌కు మరోసారి ఫిట్స్ వచ్చింది. ఆ సమయంలో వైద్యుడు అందుబాటులో లేక పోవడంతో సిబ్బంది చికిత్స చేసి వైద్యుడికి సమాచారం ఇచ్చారు. ఆయన ఆస్పత్రికి వచ్చి బాలుడిని పరీక్షించి మృతి చెందాడని చెప్పారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఆందోళన చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

రాజంపేట: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జిల్లా రెండో తరగతి జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించారు. రాజంపేట పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా గ్రామానికి చెందిన నర్సింలు డ్రంకన్ డ్రైవ్‌లో దొరికాడు. శుక్రవారం ఆయనను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై సంపత్ తెలిపారు.

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన పది మందిని శుక్రవారం జడ్జి సయ్యద్ ఖదీర్ ఎదుట హాజరుపర్చగా బచ్చల నాగరాజు, మోగులూరి వెంకటేశ్వర్లుకు మూడు రోజులు, లక్కరాజు శ్రీనివాస్‌కు నాలుగు రోజుల శిక్ష విధించారు. మిగతా వారికి జరిమానా వేశారు.

వృద్ధుడి అదృశ్యం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని పంచముఖి హనుమాన్ కాలనీకి చెందిన మైలారం బాలయ్య(68) అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లిన బాలయ్య తిరిగి రాలేదు. ఆయనకు మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో బాలయ్య కోడలు తులసి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యాధికారి మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

మోర్తాడ్: ఏర్గట్ల మండలం బట్టాపూర్ శివారులో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్ జిల్లా కడెం మండల వైద్యాధికారి రాజ్‌కుమార్(32) మృతి చెందాడు. మెండోరా మండలం సావెల్‌కు చెందిన రాజ్‌కుమార్ కడెంలో విధులు నిర్వహిస్తున్నాడు. వ్యక్తిగత పనులపై బట్టాపూర్ వచ్చి సావెల్‌కు వెళ్తుండగా కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మరణించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

సోలార్ ప్లాంట్‌లో కరెంట్ షాక్‌తో ఒకరు..



ఈశ్వర్ (ఫైల్)

మాచారెడ్డి: సోలార్ ప్లాంట్‌లో కూలీ పని చేస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన దుమ్మాల ఈశ్వర్(35) శుక్రవారం గ్రామ శివారులోని సోలార్ ప్లాంట్‌లో కూలీ పని చేయడానికి వెళ్లాడు. ప్లాంటులో పెరిగిన పచ్చ గడ్డిని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రైలులో నుంచి పడి వృద్ధుడు..

ఖలీల్‌వాడి: రైలు నుంచి పడి గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నగర శివారులోని మిర్చి కాంపౌండ్ దగ్గర గుర్తు తెలియని రైలులో నుంచి జారిపడి మృతి చెందాడన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని గాజుల్‌పేట్‌కు చెందిన బైరి రోహిత్ (26) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామ్ శుక్రవారం తెలిపారు. రోహిత్ మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకులపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని మంచిప్పకు చెందిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. గ్రామంలోని ప్రాజెక్టుకు వెళ్లే బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి సమీర్, సాగర్, నందు, వీరేందర్ మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో మూత్ర విసర్జన కోసం వచ్చిన పల్లికొండ సాయి వీరిని మందలించాడు. ఈక్రమంలో వీరి మధ్య వాగ్వాదం జరగడంతో పరస్పర దాడులకు దిగారు. సాయిని కొడుతుండగా అరుపులు విన్న సాయి తండ్రి వద్దిరాజు అక్కడికి వచ్చాడు. నలుగురు కలిసి వద్దిరాజును తీవ్రంగా చితకబాదారు. దీంతో నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైద్యపరీక్షలను వినియోగించుకోవాలి



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి బాంబే క్లాథ్ హౌస్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఉదయం నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి శాసనసభ్యుడు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఉచిత కంటి శిబిరం ప్రచార ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. వైద్య శిబిరంలో ఆపరేషన్లు అవసరమైన వారికి వీటీ ఠాకూర్ లయన్స్ ఆస్పత్రిలో చికిత్సలు చేస్తామని ప్రతినిధి వీటీ లాల్ తెలిపారు. బాంబే క్లాథ్ హౌస్ యాజమాన్యం తమ లాభాల్లో కొంత పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బి.శంకర్, ప్రతినిధి ప్రతాప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులు మంజూరు చేయండి



ఎమ్మెల్యే కేవీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ చరణ్ మాట్లాడారు. కళాశాలలో 586 మంది విద్యార్థులు చదువుతున్నారని వారికి సరిపడా తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాగే ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్స్, గ్రంథాలయం కోసం గదులు కూడా లేవన్నారు. అదనపు గదులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, నాయకులు సాయి చరణ్, అల్తాఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు అండగా నిలవాలి



మాట్లాడుతున్న గాలి అనిల్‌కుమార్

కామారెడ్డి అర్బన్ : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మున్నూరుకాపులను గుర్తించి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ తనకు టికెట్ ఇచ్చినందున అందరు అండగా నిలబడి గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం కామారెడ్డిలో మున్నూరుకాపు సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో పాటు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్‌లు మాట్లాడారు. మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, నాయకులు కుంటి అంజనేయులు, ఆకుల శ్రీనివాస్‌రావు, రావుల గంగాధర్, మామిండ్ల లక్ష్మి, బజా లలిత, జి.పద్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్య చేసేందుకు వచ్చి బైక్ చోరీ

- దొంగతనం కేసులో అరెస్ట్
- విచారణలో వెలుగులోకి నిజం

కమ్మర్‌పల్లి: ఒకరిని హత్య చేయడానికి వచ్చిన వారు.. అక్కడకు వెళ్లడానికి బైక్ చోరీ చేశారు. చోరీ కేసు విచారణలో వారిని అదుపులోకి తీసుకోగా హ త్య చేయడానికి వచ్చినట్లు ఒప్పుకున్నారు. కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు.. మోర్తాడ్‌కు చెందిన ఎడ్డి చిన్నారెడ్డి, ఆయన సోదరుడు ఎడ్డి నర్సయ్యకు మధ్య భూ వివాదం ఉంది. భూమిపై నర్సయ్య కోర్టులో కేసు వేశాడు. దీంతో ఆ భూమి క్రయవిక్రయాలకు బ్రేక్ పడింది. చిన్నారెడ్డి కొడుకు సుధాకర్‌కు అప్పులు ఉండగా డబ్బులు అవసరమయ్యాయి. ఆ భూమిని విక్రయించి అప్పులు తీర్చా లని భావించాడు. కానీ కోర్టులో కేసు ఉండడంతో విక్రయించడానికి వీలు లేకుండా పోయింది. దీంతో సుధాకర్ తన పెదనాన్న నర్సయ్యను హతమార్చాలని పథకం వేశాడు. ఫేస్‌బుక్ ద్వారా పరిచయం అయిన ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన వెన్నదుర్గా దినేష్ ఆలియాస్ సాయిని సంప్రదించాడు. నర్సయ్యను హతమార్చడానికి రూ.2.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. ఇద్దరు కలిసి విజయవాడ నుంచి ఈ నెల 18న అర్ధరాత్రి 2:30 గంటలకు కమ్మర్‌పల్లిలో బస్సు దిగారు. ఉప్లూర్ రోడ్‌లోని ఓ ఇంటి వద్ద ఉన్న బైక్‌ను దొంగిలించి దానిపై మోర్తాడ్ వెళ్లారు. నర్సయ్య ఇల్లు, మోర్తాడ్ వడ్యాట్ రోడ్‌లోని వ్యవసాయ భూమిని పరిశీలించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి, వడ్యాట్ రోడ్‌లో ఉదయం వీరు అనుమానాస్పదంగా కనిపించడంలో బైక్ దొంగిలించారనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. తాము నర్సయ్యను హతమార్చడానికి వచ్చామని, మోర్తాడ్ వెళ్లడానికి బైక్ అవసరం కాగా చోరీ చేశామని ఒప్పుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బాలికను కొనుగోలు చేసి బలవంతపు వ్యభిచారం

- ముగ్గురు నిందితుల అరెస్టు

కామారెడ్డి క్రైం: తల్లిదండ్రులు లేని బాలికను బంధువుల నుంచి కొనుగోలు చేసి వ్యభిచారం చేయిస్తున్న ముగ్గురు వ్యక్తులను కామారెడ్డి పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డిలోని ఓ కాలనీకి చెందిన బాలికకు తల్లిదండ్రులు లేరు. తన చిన్నమ్మ వద్ద నివసిస్తుంది. కొత్త బస్టాండ్ ప్రాంతంలో వ్యభిచారం నిర్వహించే ఓ ముఠా ఆమెపై కన్నేసింది. మైనర్ అని కూడా చూడకుండా ఆమె చిన్నమ్మ వద్ద నుంచి డబ్బులకు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో బాలికను బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. దీంతో నిందితులైన సంపంగి లక్ష్మి, ఆమెతో సహజీవనం చేస్తున్న సుంకరి శంకర్, వారికి సహకరిస్తూ తన లాడ్జిలో వ్యభిచారం కొనసాగిస్తున్న శ్రీనివాస లాడ్జి యజమాని నరసింహారెడ్డి లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లో చోరీ.. లింగంపేటలో విక్రయం

- ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 8 బైక్‌లు స్వాధీనం

లింగంపేట: హైదరాబాద్‌లో బైక్‌లను చోరీ చేసి, లింగంపేటలో విక్రయిస్తున్న ఇద్దరిని శుక్రవారం హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. హైదరాబాద్‌లో బైక్‌లు చోరీ చేసే ముఠా వాటిని విక్రయించాలని లింగంపేట మండలం బోనాల్ గ్రామానికి చెందిన శివకుమార్‌గౌడ్, అయిలాపూర్ గ్రామానికి చెందిన మన్నె రాజుకు అప్పగించేవారు.

వారు మండలంలో పలు బైక్‌లు విక్రయించినట్లు పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్‌లో చోరీకి పాల్పడుతున్న వ్యక్తులు దొరకడంతో వారు ఇచ్చిన సమాచారం మేరకు మండలంలోని నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకొని జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అల్ప్రాజోలం పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

సదాశివనగర్: మండలంలోని పద్మాజీవాడి శివారు లో గురువారం రూ.ఐదు లక్షల విలువ చేసే అల్ప్రాజోలం పట్టుకొని, నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ సంతోష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు చెందిన చేపూరి ప్రశాంత్‌గౌడ్, గంభీరావ్‌పేట్ మండలం సీతారాంనగర్‌కు చెందిన పాపుగారి రాజు, సదాశివనగర్ మండలం పద్మాజీవాడి చౌరస్తాకు చెందిన బండమీది బాలాగౌడ్, కల్వరాల్‌కు చెందిన ఎండీ వాజీ రాజస్థాన్ నుంచి అల్ప్రాజోలం కొనుగోలు చేసి ఇక్కడ సరఫరా చేస్తున్నారు. వీరికి రాజస్థాన్‌కు చెందిన భవాని సింగ్, ముఖేష్ సింగ్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. గురువారం పద్మాజీవాడి శివారులోని స్నేహ పౌల్ట్రీ ఫారం వద్ద అల్ప్రాజోలం డెలివరీ తీసుకుంటున్న ప్రశాంత్‌గౌడ్, రాజు, బాలాగౌడ్, వాజీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.ఐదు లక్షల విలువైన అల్ప్రాజోలం, రెండు కార్లు, రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ముందస్తు సమాచారం సేకరించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ సంతోష్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, సదాశివనగర్ ఎస్సై రాజు, సిబ్బందిని ఎస్పీ సింధుశర్మ, డీఎస్పీ అభినందించారు.